Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

అనిరుధ్–కావ్య పెళ్లిలో రజనీకాంత్ స్టెప్పులు.. గ్రీస్‌లో తలైవా సందడి 4



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 208 | పేజీలు : 4 | నవంబర్ 13 శుక్రవారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 208 | PAGES:4 | FRIDAY NOVEMBER 13 2026 | Rs. 4:00

ఇక నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ కాదు..
వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట: రేవంత్ రెడ్డి

- తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన సీఎం
- చెరువు విస్తరణ కోసం 2 ఎకరాల స్థలాన్ని అందించిన నటుడు నాగార్జున
- 14 ఎకరాలకు కుంచించుకుపోయిన తమ్మిడికుంటను 30 ఎకరాలకు విస్తరించిన ప్రభుత్వం
- నగరంలో చెరువుల పరిరక్షణతో పాటు లేక్ ఎకానమీని ప్రోత్సహిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటన
- మూసీ నది పునరుజ్జీవనం ద్వారా నల్గొండ జిల్లా ప్రజల ఇబ్బందులు తొలగిస్తామని హామీ



"నిన్నటి వరకు అందరూ శిల్పారామం గురించే మాట్లాడుకున్నారు.. కానీ ఇవాళ్టి నుంచి తమ్మిడి కుంట గురించే మాట్లాడుకుంటారు. ఇకపై ఐటీ ఉద్యోగులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' కాదు.. 'వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట' అంటారు" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నగరంలో ఆధునికీకరించిన తమ్మిడికుంట చెరువును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొంతమందికి తాత్కాలికంగా నష్టం జరిగినా, రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును అందించాలన్న లక్ష్యంతోనే తమ్మిడికుంటను పూర్తిస్థాయిలో అభివృద్ధి (మిగతా 2వ పేజీలో..)

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే సహించేది లేదు.. మంత్రి పొన్నం హెచ్చరిక

- ఆర్టీసీ ఉద్యోగులపై భౌతిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్న పొన్నం
- ఉద్యోగులు ఎక్కడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచన
- ఉద్యోగులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని పేర్కొన్న మంత్రి
- ఉచిత బస్సు వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని ప్రకటన
- ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్‌గౌడ్ కుటుంబానికి నియామక పత్రం



2

హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ.. జెన్‌పాక్ట్‌తో కీలక భాగస్వామ్యం



హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) ప్రధాన కేంద్రంగా ఎదుగుతున్న క్రమంలో మరో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఇక్కడ తన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రఖ్యాత సంస్థ 'మార్స్' ఐటీ సేవల సంస్థ 'జెన్‌పాక్ట్' భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సరికొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను గురువారం తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించారు.ఈ సరికొత్త కేంద్రం ప్రస్తుతం 60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యకలాపాలు మొదలుపెట్టింది. ప్రారంభ దశలో భాగంగా 400 నుంచి 525 మంది జెన్‌పాక్ట్ ఉద్యోగులతో కార్యకలాపాలు సాగనున్నాయి. భవిష్యత్తులో ఈ కేంద్రాన్ని మరింత విస్తరించేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాబోయే కాలంలో మరో 70,000 చదరపు అడుగుల స్థలాన్ని జోడించి, ఉద్యోగుల సంఖ్యను దాదాపు 1,000 మంది మార్స్ అసోసియేట్స్ స్థాయికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ కేంద్రం ప్రధానంగా అత్యాధునిక సాంకేతిక సేవలపై దృష్టి సారించనుంది. (మిగతా 2వ పేజీలో..)

నా జీవితం తెరిచిన పుస్తకం: డీకే శివకుమార్

తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని, అందులో దాచడానికి రహస్యాలేమీ లేవని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సహా తాను ఎవరికీ కీడు తలపెట్టబోనని ఆయన పేర్కొన్నారు. మైసూరులో బుధవారం తన జీవిత చరిత్ర 'చలిసువ బండె డీకే శివకుమార్' పుస్తకావిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు."నేను సిద్ధరామయ్యతో కలిసి పనిచేశాను. ఆయనకు గానీ, మరెవరికీ గానీ నేను చెడు కోరుకోను. ఇతరులకు హాని తలపెట్టే వ్యక్తిని నేను కాదు, భవిష్యత్తులోనూ అలా చేయను. ఇదే నా నిబద్ధత" అని శివకుమార్ వివరించారు. మానవత్వమే అన్నింటికన్నా ముఖ్యమని, అన్ని కులాలు, మతాల ప్రజలను తాము ప్రేమిస్తామని, గౌరవిస్తామని తెలిపారు. తన ఎదుగుదలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని, అయితే విమర్శలకు తాను వెరవబోనని స్పష్టం చేశారు.
(మిగతా 2వ పేజీలో..)



2047 వరకు వేచి చూడాల్సిన పనిలేదు.. అంతకంటే ముందే వికసిత భారత్: ప్రధాని మోదీ

- వికసిత భారత్ లక్ష్యం అందుబాటులోనే ఉందన్న ప్రధాని మోదీ
- 2047 అనేది డెడ్‌లైన్ కాదు, నిరంతర లక్ష్య సాధన మార్గమని వెల్లడి
- దేశ విజయాలను ప్రపంచానికి చాటిచెప్పాలని మీడియాకు పిలుపు
- స్వాతంత్ర్య ఉద్యమంలా చిన్న లక్ష్యాలతోనే పెద్ద గమ్యానికి చేరతామన్న ప్రధాని

'వికసిత భారత్' లక్ష్యం మనకు పూర్తిగా అందుబాటులోనే ఉందని, ఇటీవలి సంవత్సరాలలో దేశం సాధించిన విజయాలే దీనికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. 2047వ సంవత్సరాన్ని మనం వేచి చూడాల్సిన డెడ్‌లైన్‌గా కాకుండా, ఆ లక్ష్యం దిశగా నిరంతరం పురోగతి సాధించాల్సిన మార్గంగా చూడాలని ఆయన స్పష్టం చేశారు. నేడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆధ్వర్యంలో పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'దీపావళి మిలన్ సమారోహ్' కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "భారత్ నేడు సాధిస్తున్న విజయాల దృష్ట్యా, వికసిత భారత్ లక్ష్యం మనకు అందనంత దూరంలో లేదు" అని అన్నారు. సాంకేతిక, మౌలిక సదుపాయాల రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని ఆయన ఉదహరించారు. "ఒకప్పుడు ఊహించడానికే కష్టంగా ఉన్న మైలురాళ్లను భారత్ ఇప్పుడు అందుకుంటోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ను దింపి భారత్ చరిత్ర సృష్టిస్తుందని, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా ఎదుగుతుందని ఎవరైనా ఊహించారా? గత 12 ఏళ్లలోనే ప్రపంచంలో (మిగతా 2వ పేజీలో..)



సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలోనూ నాగార్జున హీరో: సీఎం రేవంత్

ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలోనూ హీరో అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ కోసం రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి తిరిగి అప్పగించినందుకు నాగార్జునను ఆయన అభినందించారు. పునరుద్ధరించిన చెరువును బుధవారం సాయంత్రం సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున కూడా పాల్గొన్నారు.ఒకప్పుడు కబ్జాల కారణంగా దాదాపు 30 ఎకరాల విస్తీర్ణం గల తమ్మిడికుంట చెరువు 14 ఎకరాలకు కుచించుకుపోయింది. చెరువు స్థలాన్ని ఆక్రమించి నిర్మించారన్న ఆరోపణలతో 2024లో నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్‌ను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కూల్చివేసింది. మొదట కబ్జా ఆరోపణలను ఖండించినప్పటికీ, గతేడాది నాగార్జున స్వయంగా ముందుకొచ్చి రెండు ఎకరాల (మిగతా 2వ పేజీలో..)



ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి



యుద్ధాల తీరు వేగంగా మారుతున్న నేపథ్యంలో దేశానికి ఏ రూపంలోనైనా ముప్పు ఎదురయ్యే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు సైన్యం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. అవసరమైన సందర్భాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించేందుకు కూడా సర్వసన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఢిల్లీలో నిర్వహించిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ, ప్రతిదాడుల విషయంలో అధునాతన పద్ధతులను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవా

శత్రువుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ముప్పును ముందుగానే గుర్తించే సామర్థ్యాలను పెంపొందించుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. ప్రమాదం సంభవించిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తు సమాచారంతో అప్రమత్తమై నష్టాన్ని నివారించేలా వ్యవస్థలను సిద్ధం చేసుకోవాలన్నారు. గూఢచార, నిఘా యంత్రాంగాలను మరింత బలోపేతం చేయాలని, ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు ప్రతిక్షణం సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. (మిగతా 2వ పేజీలో..)

22-ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- పెండింగ్ దరఖాస్తులన్నీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి
- ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదు
- ప్రతి వారం జిల్లా స్థాయిలో సమీక్షలు నిర్వహించాలి
- పరిష్కారం కాని సమస్యలను ఉన్నతస్థాయి కమిటీకి పంపాలి
- యూఎల్‌సీ సమస్యలపై వారం రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలి
- జీవో 59, 76, 118 అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



22-ఎ నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నిషేధిత భూముల జాబితాలో చోటు చేసుకున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన భూ యజమానులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ (మిగతా 2వ పేజీలో..)

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

సంపాదకీయం

మారుతున్న కాలం.. మారని మానవ విలువలు!

ఆధునిక సాంకేతికత, మారుతున్న జీవనశైలి మనిషికి ఎన్నో సౌకర్యాలను అందిస్తున్నాయి. కానీ ఈ వేగవంతమైన మార్పుల్లో మానవ సంబంధాలు, ఆప్యాయత, పరస్పర గౌరవం వంటి విలువలకు ప్రాధాన్యం తగ్గకూడదు. బిజీ జీవితం పేరుతో కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు కూడా సమయం కేటాయించలేని పరిస్థితులు పెరుగుతున్నాయి.డబ్బు, హోదా, ఆస్తులు జీవితంలో అవసరమే. కానీ కష్టసమయంలో అండగా నిలిచే మనుషులు లేకపోతే వాటికి పూర్తి అర్థం ఉండదు. ఎదుటివారి బాధను అర్థం చేసుకోవడం, అవసరంలో సహాయం చేయడం, పెద్దలను గౌరవించడం, చిన్నవారిని ప్రోత్సహించడం వంటి లక్షణాలే సమాజాన్ని బలంగా నిలబెడతాయి.ముఖ్యంగా పిల్లలకు విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, బాధ్యత, మానవత్వం నేర్పాలి. పోటీ ప్రపంచంలో విజయం సాధించడం ఎంత ముఖ్యమో మంచి మనిషిగా ఎదగడం కూడా అంతే ముఖ్యం.కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి ఒక్కరూ మానవ సంబంధాలకు విలువ ఇవ్వాలి. స్వార్థం, అసూయ, ద్వేషం వంటి భావాలకు దూరంగా ఉండి సహకారం, సానుభూతి, ఐక్యతను పెంపొందించాలి. కాలం మారవచ్చు.. సాంకేతికత మారవచ్చు.. జీవన విధానం మారవచ్చు. కానీ మనిషిని మనిషిగా నిలబెట్టే మానవత్వం మాత్రం ఎప్పటికీ మారకూడదు. అభివృద్ధితో పాటు విలువలను కాపాడుకున్నప్పుడే ఆరోగ్యకరమైన, ఆదర్శవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది.

ఇక నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ కాదు.. వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట: రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

చేశామని స్పష్టం చేశారు. ఒకప్పుడు ఆక్రమణలకు గురై కేవలం 14 ఎకరాలకు కుచించుకుపోయిన ఈ చెరువును, ఇప్పుడు 30 ఎకరాల విస్తీర్ణానికి పెంచినట్లు వివరించారు.

చెరువుల ఆక్రమణలతోనే కాలనీలు జలమయం

హైదరాబాద్ నగరం అంటేనే 'రాక్స్ అండ్ లేక్స్ సిటీ' అని సీఎం గుర్తుచేశారు. గతంలో నగరంలో 1372 చెరువులు ఉండేవని, కానీ వివిధ కారణాలు, ఆక్రమణల వల్ల దాదాపు 50 శాతం చెరువులు కనుమరుగైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులను కబ్జా చేయడం వల్లే కొద్దిపాటి వర్షం పడినా రోడ్లపైకి నీళ్లు రావడం, కాలనీలు చెరువులను తలపించడం జరుగుతోందని.. ఈ దుస్థితిపై సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. వందేళ్ల క్రితమే మూసీ వరదల నుంచి నగరాన్ని రక్షించడానికి నిజాం పాలకులు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నిర్మించారని, ముచుకుందా నది.. మూసా, ఈసా సంగమంతో మూసీగా రూపాంతరం చెంది నదీ నాగరికతకు కేంద్రంగా మారిందని గుర్తుచేశారు.

మూసీ ప్రక్షాళన ఆగదు.. బాధితులకు అండగా ఉంటాం

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మూసీ తీవ్రంగా కలుషితమైందని, ఆ విషపు నీటి ప్రభావంతో నల్లగొండ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా తీవ్ర అనారోగ్యాలతో శిక్ష అనుభవిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మూసీ పునరుజ్జీవనం చేపట్టాలని సంకల్పించామని చెప్పారు. "మూసీకి కావాల్సింది కేవలం బాహ్య సుందరీకరణ కాదు.. దానికి పూర్తిస్థాయి పునరుజ్జీవం కల్పించడమే మా లక్ష్యం. ఈ ప్రక్రియలో ఏ ఒక్కరికీ అన్యాయం లేదా నష్టం జరగకుండా ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకుంటుంది. త్వరలోనే మూసీ పునరుజ్జీవం తొలి దశ పనులను ప్రారంభిస్తాం" అని వెల్లడించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు మాట్లాడాలని, నగరాభివృద్ధి కోసం అన్ని పక్షాలూ రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

'లేక్ ఎకానమీ' అభివృద్ధికి పెద్దపీట

నగరంలోని చెరువులను కాపాడుకుంటూనే వాటి చుట్టూ 'లేక్ ఎకానమీ'ని ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. తమ్మిడికుంట ప్రాంగణంలో ప్రజలకు పూర్తి భద్రత ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే చెరువు ఆవరణలో ఒక జమ్మి చెట్టును నాటాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించారు. అలా చేస్తే దసరా వంటి సంప్రదాయ వేడుకలకు చెరువులు కేంద్ర బిందువులుగా మారి, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడానికి ఎంతగానో దోహదపడతాయని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే సహించేది లేదు.. మంత్రి పొన్నం హెచ్చరిక

ఆర్టీసీ ఉద్యోగులపై భౌతిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఉద్యోగులు ఎక్కడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప దాడులకు దిగవద్దని ప్రజలకు సూచించారు.ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ బాధ్యత అయితే, ఉద్యోగులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసి ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. ఆయన కుమారుడు హేమంత్ గౌడ్‌కు ఆర్టీసీలో ఉద్యోగ నియామక పత్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ ఇప్పటికే పరిహారం అందించాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు తమ ఒక రోజు వేతనం ద్వారా సుమారు రూ.కోటి సాయం చేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు ఆయన కుమారుడికి ఉద్యోగం కల్పించామని చెప్పారు.

సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలోనూ నాగార్జున హీరో: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి)

భూమిని ప్రభుత్వానికి అప్పగించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "అక్కినేని నాగార్జున పెద్ద మనసుతో ముందుకొచ్చి 2 ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చారు. ఆయన సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలోనూ హీరో అని నిరూపించుకున్నారు" అని అన్నారు. దీనిపై స్పందించిన నాగార్జున.. ముఖ్యమంత్రికి స్పష్టమైన దార్శనికత ఉందని, చెరువులు, నదుల పునరుజ్జీవనానికి ఆయన అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రశంసించారు. మూసీనది ప్రారంభోత్సవానికి కూడా తనను పిలుస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.హైదరాబాద్ నగరం ఒకప్పుడు రాళ్లు, చెరువులకు ప్రసిద్ధి అని సీఎం గుర్తుచేశారు. "నగరంలో ఒకప్పుడు 1,372 చెరువులు ఉంటే, అందులో 50 శాతం కనుమరుగయ్యాయి. చెరువులను కబ్జా చేయడం వల్లే వర్షం పడినవుడు రోడ్లపై నీరు నిలిచి కాలనీలు మునిగిపోతున్నాయి. ఈ పరిస్థితిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలి" అని పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణతోనే హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కలుషితమైన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టును కూడా చేపట్టామని సీఎం తెలిపారు. "ప్రపంచంలో నదీ ఆధారిత నాగరికతలే అభివృద్ధి చెందాయి. వందేళ్ల క్రితమే నిజాం మూసీ బేసిన్‌ను అభివృద్ధి చేశారు. ఇప్పుడు మేము మూసీని కేవలం సుందరీకరించడం లేదు, పూర్తిస్థాయిలో పునరుజ్జీవింపజేస్తున్నాము. ఈ ప్రాజెక్ట్ కింద నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. మూసీ పునరుజ్జీవనానికి రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసి రావాలని ఆయన కోరారు.

ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి)

శత్రువుల వ్యూహాలకు దీటైన ప్రతిస్పందన

శత్రువులు కోలుకునేందుకు అవకాశం ఇవ్వని రీతిలో రక్షణ దళాలు తమ సామర్థ్యాలను పెంచుకోవాలని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఆకస్మిక దాడులు జరిగినా శత్రువుల వ్యూహాల్లో చిక్కుకోకుండా ముందుగానే అప్రమత్తమయ్యేలా సైన్యం బలపడాలని సూచించారు. మన రక్షణ చర్యలు శత్రువుల అంచనాలకు అందని విధంగా ఉండాలని, పరిస్థితులకు అనుగుణంగా వేగంగా స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.

సైబర్, అంతరిక్ష యుద్ధాలపై దృష్టి

భవిష్యత్తులో సైబర్ యుద్ధాలు, అంతరిక్షంలో ఆయుధాలను మోహరించి శత్రువులపై దాడులు చేసే ఆధునిక యుద్ధ పద్ధతులు మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు వైమానిక దళం ప్రత్యేక విధానాలు, వ్యూహాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికత, నిఘా, రక్షణ సామర్థ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని స్పష్టం చేశారు.

2047 వరకు వేచి చూడాల్సిన పనిలేదు.. అంతకంటే ముందే వికసిత భారత్: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి)

మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థను నిర్మించుకున్నాం. మన యూపీఐ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా నిలిచింది. ఇవన్నీ సాధించగలిగినప్పుడు, వికసిత భారత్ కలను కూడా మనం కచ్చితంగా సాకారం చేసుకోగలం. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ బ్రిడ్జి నిర్మిస్తారని ఎవరు భావించారు?" అని ప్రధాని పేర్కొన్నారు.గత 12 ఏళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వచ్చిన మార్పును ఆయన ఉదహరించారు. "మిత్రులారా.. 12 ఏళ్ల క్రితం నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కూడా పెద్ద విజయంగా భావించేవారని గుర్తుంచుకోండి. నేను ముఖ్యమంత్రిగా ఉన్న తొలి రోజుల్లో గ్రామాలకు వెళితే, కరవు పనుల్లో భాగంగా మా ఊరికి కనీసం ఒక రోడ్డు వేయించండి సారూ అని వినతిపత్రాలు ఇచ్చేవారు" అని ఆయన గుర్తుచేసుకున్నారు. పేదరిక నిర్మూలన విషయంలో ప్రభుత్వాల వైఖరిలో వచ్చిన మార్పును కూడా మోదీ వివరించారు. "ఒకప్పుడు ప్రతి నాయకుడు ఎర్రకోట నుంచి పేదరికాన్ని నిర్మూలిస్తామని నినదించేవారు. అది ఒక మంత్రంలా ఉండేది. ప్రతి ఎన్నికలోనూ పేదరికాన్ని పోగొడతామని హామీలు ఇచ్చేవారు. కానీ నేడు, పేదలు స్వయంగా పేదరికం నుంచి బయటపడుతున్నారు. పేదరికం తగ్గుముఖం పట్టడం మనం చూస్తున్నాం" అని తెలిపారు.కసిత భారత్ లక్ష్యంపై మాట్లాడుతూ, ప్రధాని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉదాహరణగా చూపారు. "సంపూర్ణ స్వాతంత్ర్యం అనేది ఒకటి రెండు రోజుల్లో సాధ్యపడలేదు. క్రమంగా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగింది. అదే విశ్వాసం ఇప్పుడు దేశ ప్రజల్లో కనిపిస్తోందని, అదే మనల్ని వికసిత భారత్ లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని పేర్కొన్నారు.భారతదేశ విజయగాథలను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. "21వ శతాబ్దంలో కమ్యూనికేషన్ అనేది అతిపెద్ద బలం. మనకు యువ జనాభా, ప్రతిభ, టెక్నాలజీ, చౌకైన డేటా ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రపంచానికి చెప్పడానికి మన దగ్గర ఒక అద్భుతమైన కథ 'ఇండియా స్టోరీ' ఉంది. నా 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా దేశ ప్రజల విజయాలకు నేను నిరంతరం ఒక వేదిక కల్పిస్తున్నాను. భారత మీడియా కూడా దేశ విజయాలను చాటిచెప్పే కథనాలపై పనిచేసి, వాటిని ముందుకు తీసుకెళ్లాలి. ఇది దేశానికి చేసే గొప్ప సేవ అవుతుంది" అని ప్రధాని కోరారు. అనంతరం దీపావళి, నవరాత్రి, ఛత్ పూజ పండుగల సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

నా జీవితం తెరిచిన పుస్తకం: డీకే శివకుమార్

మొదటి పేజీ తరువాయి)

గతంలో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ ఆయనతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించినప్పుడు ఆయనను ఇబ్బంది పెట్టకుండా, మద్దతుగా నిలిచేందుకే ప్రయత్నించానని గుర్తుచేశారు. "మనం చేసే పనిని మన మనస్సాక్షి అంగీకరిస్తే చాలు" అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.ముఖ్యమంత్రి లేదా కేబినెట్ మంత్రి పదవులు చేపట్టడం కంటే, 48 ఏళ్ల వయసులో మైసూరు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పట్టా అందుకోవడం తన జీవితంలో అత్యంత సంతోషకరమైన క్షణమని శివకుమార్ పేర్కొన్నారు. కష్టకాలంలో జైలులో ఉన్నప్పుడు కూడా తాను ఆత్మవిశ్వాసం కోల్పోలేదని, పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువస్తాననే నమ్మకంతో పనిచేశానని తెలిపారు. యువత అదృష్టాన్ని నమ్ముకోకుండా కష్టం, క్రమశిక్షణపై ఆధారపడాలని హితవు పలికారు. విమర్శలు కాలక్రమేణా కనుమరుగవుతాయని, కానీ మనం చేసిన పనులే శాశ్వతంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ.. జెన్‌పాక్ట్‌తో కీలక భాగస్వామ్యం

మొదటి పేజీ తరువాయి)

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ అండ్ క్లౌడ్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, డేటా అండ్ అనలిటిక్స్ వంటి కీలక టెక్నాలజీ విభాగాల్లో హైదరాబాద్ కేంద్రం నుంచి గ్లోబల్ సేవలు అందనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిష్కారాలను అందించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషించనుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. స్నికర్స్, ఎం అండ్ ఎమ్స్, పెడిగ్రీ, రాయల్ కెనైన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ల ద్వారా మార్స్ సంస్థ ప్రజలకు సుపరిచితమని పేర్కొన్నారు. అంతటి గుర్తింపు ఉన్న సంస్థ తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నగరాన్ని ఎంచుకోవడం హర్షణీయమని తెలిపారు. తెలంగాణలో ఉన్న అనుకూల పారిశ్రామిక వాతావరణం, ప్రతిభావంతులైన మానవ వనరులు ఐటీ రంగ విస్తరణకు చక్కటి అవకాశాలను కల్పిస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మార్స్ మరియు జెన్‌పాక్ట్ బృందాలకు ఆయన అభినందనలు తెలియజేశారు.

22-ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

మొదటి పేజీ తరువాయి)

విషయంలో ఎలాంటి జాప్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

కలెక్టర్లతో మంత్రి సమీక్ష

హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలో సమావేశమయ్యారు. ఆయా జిల్లాల్లో 22-ఎ నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. భూ సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

22-ఎ నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించి వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు సమన్వయంతో పనిచేయాలని, పరిష్కారంలో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

ప్రతి వారం జిల్లా స్థాయిలో సమీక్ష

22-ఎ భూ సమస్యల పరిష్కారానికి ప్రతి వారం జిల్లా స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతస్థాయి కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.

యూఎల్‌సీ, జీవోల అమలుపై దృష్టి

యూఎల్‌సీ సమస్యలకు సంబంధించి వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక అందించాలని మంత్రి ఆదేశించారు. జీవో 59, 76, 118 అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ ఉత్తర్వుల పరిధిలోని అంశాలను పరిశీలించి, అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.



ఇళ్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు చర్యలు

22-ఎ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఆయా ఆస్తులకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన భూ యజమానులకు త్వరితగతిన న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రభుత్వ భూముల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

నల్గొండలో ఈ నెల 13న చేయూత పెన్షన్ల పంపిణీ






- ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ జిల్లా నవంబర్ 12 (నేటి వెలుగు):

నల్గొండ జిల్లా కేంద్రంలోని ఏచూరి గార్డెన్స్‌లో ఈ నెల 13న నిర్వహించనున్న నల్గొండ నియోజకవర్గ స్థాయి చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన అధికారులతో కలిసి ఏచూరి గార్డెన్స్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.నల్గొండ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలతో పాటు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పింఛన్ లబ్ధిదారులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, హెల్ప్ డెస్క్‌లు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మండలాలు, మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల వారీగా లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసి, ఏ కౌంటర్‌లో పింఛన్ అందజేస్తారో లబ్ధిదారులకు సులభంగా తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అలాగే పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, భోజన సదుపాయం తదితర ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురించి ముందుగానే లబ్ధిదారులకు సమాచారం అందించాలని, అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లోనూ పింఛన్లు పంపిణీ చేయకూడదని స్పష్టం చేశారు. అర్హుల జాబితాలను ముందుగానే సిద్ధం చేసి తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, మంత్రి పీఏ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మరణాలు లేని జిల్లాగా రంగారెడ్డిని తీర్చిదిద్దాలి





- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: డీఆర్ఓ శారదాదేవి
- జీరో ఫాటాలిటీ డిస్ట్రిక్ట్స్‌పై ఒకరోజు అవగాహన సదస్సు

రంగారెడ్డి జిల్లా నవంబర్ 12(నేటి వెలుగు):

రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రమాద మరణాలు లేని జిల్లాగా రంగారెడ్డి జిల్లాను తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) శారదాదేవి పిలుపునిచ్చారు.జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో సేవ్‌లైఫ్ ఫౌండేషన్ సహకారంతో జీరో ఫాటాలిటీ డిస్ట్రిక్ట్స్ కార్యక్రమంపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ శారదాదేవి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ అఫ్రీన్ సిద్ధిఖీ, జిల్లా రవాణా అధికారి కె. వాసుదేవరావు, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. రణేష్, రోడ్ సేఫ్టీ కన్సల్టెంట్ ధన్‌రాజ్ గౌడ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సాయి శ్రుతి, బి. స్వాతి, ఎం. రాఘవులు తదితరులు పాల్గొన్నారు. పోలీస్, రోడ్లు భవనాల శాఖ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (), వైద్య ఆరోగ్య శాఖల అధికారులు కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలను గుర్తించడం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను శాస్త్రీయంగా విశ్లేషించడం, రహదారుల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రోడ్డు భద్రతా ప్రమాణాలను పటిష్టంగా అమలు చేయడం వంటి అంశాలపై చర్చించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులకు సత్వర వైద్య సహాయం అందించే అత్యవసర స్పందన వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, వాటికి గల కారణాలను విశ్లేషించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రమాదాల తీవ్రతను తగ్గించే చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని నొక్కిచెప్పారు.రంగారెడ్డి జిల్లాను జీరో ఫాటాలిటీ డిస్ట్రిక్ట్‌గా తీర్చిదిద్ది విలువైన మానవ ప్రాణాలను కాపాడటమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, ఈ లక్ష్య సాధనకు సంబంధిత శాఖలన్నీ సమష్టి బాధ్యతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అన్నారంలో 45వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

- నవంబర్ 14 నుంచి 16 వరకు జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి పోటీలు
- ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథులు

పర్వతగిరి నవంబర్ 12 (నేటి వెలుగు):

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి మోడల్ స్కూల్ ప్రాంగణంలో నవంబర్ 14 నుంచి 16 వరకు 45వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ -- 2026 (జూనియర్ బాలికల విభాగం) పోటీలను నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వరంగల్ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ పర్యవేక్షణలో పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.పోటీల ప్రారంభోత్సవానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన జూనియర్ బాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం, బాలికల్లో క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో వరంగల్ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు నాగయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ రాచకొండ అశోక చారి, క్రీడల కన్వీనర్లు గంజి మహేందర్, కోటగిరి రమేష్, కోచ్ శ్రావణ్, పల్లవి మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.అన్నారం గ్రామంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అవకాశం రావడం గ్రామానికి, పల్లవి మోడల్ స్కూల్‌కు గర్వకారణమని నిర్వాహకులు తెలిపారు. క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను విజయవంతం చేయాలని కోరారు.



ప్రభుత్వ ఉన్నత ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ

- పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలోకి యర్కల శ్రీనివాస్ గౌడ్
- నిరుద్యోగ యువతకు ఉపాధే ప్రధాన అజెండా

నల్లగొండ నవంబర్ 11 (నేటి వెలుగు)



తెలంగాణ అటవీ శాఖలో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా, ప్రస్తుతం ఎఫ్‌డీఓ ఆసిఫాబాద్ బాధ్యతల్లో ఉన్న యర్కల శ్రీనివాస్ గౌడ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ప్రజా జీవితంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 26-10-2026 తేదీన ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌కు వీఆర్ఎస్ దరఖాస్తు సమర్పించారు. ప్రభుత్వ ఆమోదం రాగానే నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీకి అనుబంధంగా కాకుండా పట్టభద్రుల సమస్యలే ప్రధాన ఎజెండాగా పోటీ చేస్తానని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, పట్టభద్రుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, విద్యావ్యవస్థలో మార్పులు తన ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై శాసనమండలిలో బలమైన గొంతుకగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాన్ని వీడి ప్రజా సేవ వైపు రావాలనుకుంటున్న ఆయన నిర్ణయం ఉమ్మడి మూడు జిల్లాల పట్టభద్రుల్లో, రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

భూముల రీ-సర్వే పనులు పారదర్శకంగా చేపట్టాలి

- ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సకాలంలో పూర్తి చేయాలి
- గోసాయిగూడలో రీ-సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 12(నేటి వెలుగు):



భూముల రీ-సర్వే పనులను అత్యంత పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.మేడ్చల్ మండలం గోసాయిగూడ గ్రామంలో జరుగుతున్న భూముల రీ-సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే ప్రక్రియ కొనసాగుతున్న తీరును, భూముల హద్దుల గుర్తింపు, రెవెన్యూ రికార్డుల నమోదు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.భూముల రీ-సర్వే అనేది భూ యజమానులకు సంబంధించిన కీలకమైన ప్రక్రియ కావడంతో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సర్వే సమయంలో భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు, సర్వే బృందానికి దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, గ్రామ పరిపాలనా అధికారి (), సర్వే బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు

- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నీటి సరఫరా వ్యవస్థల పరిశీలన
- అదనపు నీటి సేకరణ, శుద్ధి సామర్థ్యం పెంపుపై జలమండలి జేఎండీ మయాంక్ మిట్టల్ సమీక్ష

హైదరాబాద్ నవంబర్ 12(నేటి వెలుగు):



రాబోయే వేసవిలో నగర ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా జలమండలి ముందస్తు చర్యలు చేపడుతోంది. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై సవాళ్లు ఎదురయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ గురువారం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలకు సంబంధించిన నీటి సరఫరా వ్యవస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గండిపేట, హిమాయత్‌సాగర్‌లోని ప్రెజర్ ఫిల్టర్లు, గండిపేటలో ప్రతిపాదించిన అదనపు 10 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ప్రెజర్ ఫిల్టర్ల ఏర్పాటుకు గుర్తించిన స్థలం, బుద్వేల్‌లోని 3 ఎంఎల్‌డీ ప్రెజర్ ఫిల్టర్లు, పునరుద్ధరించాల్సిన పాత బుద్వేల్ ఫిల్టర్లు, మీర్‌ఆలంలోని నీటి శుద్ధి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.జలాశయాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, నీటి నాణ్యత, ఇన్‌టేక్ వ్యవస్థలు, శుద్ధి కేంద్రాల పనితీరు, ప్రెజర్ ఫిల్టర్ల సామర్థ్యాన్ని సమీక్షించారు. రాబోయే వేసవిలో ఈ జలవనరుల నుంచి అదనపు నీటిని సేకరించి శుద్ధి చేసి నగరానికి సరఫరా చేసేందుకు చేపట్టాల్సిన అత్యవసర ప్రత్యామ్నాయ పనులపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా జేఎండీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ అన్ని నీటి శుద్ధి కేంద్రాలు, ప్రెజర్ ఫిల్టర్లు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా నిరంతరం నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటి రంగులో మార్పుల కారణంగా శుద్ధి ప్రక్రియకు ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే సాంకేతిక పరిష్కారాలను గుర్తించాలని సూచించారు.అదనపు నీటి సేకరణ, శుద్ధి సామర్థ్యం పెంపునకు ప్రతిపాదించిన అత్యవసర పనులను వెంటనే ప్రారంభించి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ట్రాన్స్‌మిషన్, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నగరంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.వేసవిలో తాగునీటి డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, అదనపు నీటి సరఫరాకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జలమండలి టెక్నికల్ డైరెక్టర్ ప్రభుతో పాటు ట్రాన్స్‌మిషన్, క్యూఏటీ, ఓఅండ్ఎం విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

మణిరత్నం కొత్త చిత్రం ‘ఇంజి వెల్లం’ విడుదల తేదీ ఖరారు

విజయ్ సేతుపతి, సాయి పల్లవి ప్రధాన పాత్రధారులు

వచ్చే ఏడాది జనవరి 29న ప్రపంచవ్యాప్తంగా విడుదల

సినిమాకు సంగీతం అందిస్తున్న ఏఆర్ రెహమాన్

లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ సంయుక్త నిర్మాణం



ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న నూతన చిత్రం ‘ఇంజి వెల్లం’ విడుదల తేదీ ఖరారైంది. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 29న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. మద్రాస్ టాకీస్, లైకా ప్రొడక్షన్స్ పతాకాలపై మణిరత్నం, సుభాస్కరన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ మేరకు మద్రాస్ టాకీస్ సోషల్ మీడియా వేదికగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ.. “ఈ తేదీని గుర్తుపెట్టుకోండి. జనవరి 29 నుంచి ప్రపంచవ్యాప్తంగా ‘ఇంజి వెల్లం’ సందడి షురూ” అంటూ పోస్ట్ చేసింది. లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. గత సెప్టెంబర్‌లో ఒక ప్రత్యేకమైన వాయిస్ ఓవర్ క్లిప్ ద్వారా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో ‘ఇంజి’ (అల్లం) ఎవరు, ‘వెల్లం’ (బెల్లం) ఎవరు అంటూ విజయ్ సేతుపతి, సాయి పల్లవి మధ్య సాగే సరదా సంభాషణ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ‘చెక్క చివంత వానమ్’ (నవాబ్) తర్వాత మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతి నటిస్తున్న రెండో చిత్రమిది. ఈ సినిమాకు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, అవిక్ ముఖోపాధ్యాయ్ సినిమాటోగ్రాఫర్‌గా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. అగ్ర శ్రేణి నటీనటులు, దిగ్గజ సాంకేతిక నిపుణుల కలయికలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్టుపై సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

అనిరుధ్–కావ్య పెళ్లిలో రజనీకాంత్ స్టెప్పులు.. గ్రీస్‌లో తలైవా సందడి

75 ఏళ్ల వయసులో ‘మనసిలాయో’ పాటకు ఉత్సాహంగా స్టెప్పులేసిన సూపర్‌స్టార్

గ్రీస్ దేశంలో అత్యంత వైభవంగా అనిరుధ్–కావ్య వివాహ వేడుక

హాజరైన తమిళనాడు మాజీ సీఎం స్టాలిన్ మరియు కళానిధి మారన్ కుటుంబం

చెన్నైలో నవంబర్ 21న ఘనంగా వెడ్డింగ్ రిసెప్షన్ ఏర్పాట్లు

ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. వీరిద్దరి వివాహ వేడుక గ్రీస్ దేశంలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఎంతో వైభవంగా జరిగింది. డెస్టినేషన్ వెడ్డింగ్‌గా నిర్వహించిన ఈ శుభకార్యానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.ఈ వివాహ వేడుకలో సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనిరుధ్‌కు బంధువైన రజనీకాంత్, కొత్త దంపతులను ఆశీర్వదించడమే కాకుండా వారితో కలిసి ఉత్సాహంగా సందడి చేశారు. తన బ్లాక్‌బస్టర్ హిట్ పాట ‘మనసిలాయో’కు అనిరుధ్, కావ్య మారన్‌లతో కలిసి రజనీకాంత్ వేసిన మాస్ స్టెప్పులు వేడుకలో సరికొత్త జోష్ నింపాయి. 75 ఏళ్ల వయసులో కూడా ఆయన తనదైన మార్కు స్టైల్‌తో డ్యాన్స్ చేసి అతిథులను ఆశ్చర్యపరిచారు. ఈ డ్యాన్స్ వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో అభిమానులను, నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ వేడుకకు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, కళానిధి మారన్ కుటుంబంతో పాటు ఇరు కుటుంబాలకు చెందిన సన్నిహితులు, పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. విదేశంలో జరిగిన ఈ వివాహం అనంతరం, సినీ, రాజకీయ, వ్యాపార రంగాల ప్రముఖుల కోసం చెన్నైలో భారీగా వెడ్డింగ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నవంబర్ 21న ఈ విందు కార్యక్రమం అత్యంత ఘనంగా జరగనుంది.



ఎస్టీల హక్కుల సాధనకు కమిషన్ కోర్టు ఒక ఆయుధం





- **సమస్యల పరిష్కారానికి ఎన్‌సీఎస్టీ ఆన్‌లైన్ పోర్టల్‌ను ఆశ్రయించండి**
- **దేవరకొండ మైనింగ్ కార్యకలాపాలపై సమగ్ర సర్వేకు ఆదేశం**
- **ఐదు రోజుల్లో ప్రాథమిక నివేదిక.. 15 రోజుల్లో శాఖల వారీగా పూర్తి నివేదికలు: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ నాయక్**

దేవరకొండ నవంబర్ 12 (నేటి వెలుగు)

షెడ్యూల్డ్ తెగల ప్రజలు తమ హక్కుల సాధన కోసం జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్టీ)ను ఆశ్రయించాలని కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ నాయక్ పిలుపునిచ్చారు. ఎస్టీ కమిషన్ కోర్టు ప్రజల హక్కుల సాధనకు ఒక ఆయుధమని, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురైనా కమిషన్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. తెల్ల కాగితంపై సమస్యను రాసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే డైరీ నంబర్ కేటాయించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గురువారం నల్గొండ జిల్లా దేవరకొండ మండలంలోని వెంకట్ తండా, బొల్లిగుట్ట తండా, కాచారం గ్రామాల్లో ఆయన పర్యటించి షెడ్యూల్డ్ తెగల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎస్టీ ప్రజల సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. దేవరకొండ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న మైనింగ్ కార్యకలాపాలపై మైనింగ్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

మైనింగ్‌పై ఐదు రోజుల్లో నివేదికలు

శ్రీ వెంకటేశ్వర వెంగమాంబ మైనింగ్ కార్యకలాపాలపై స్థానిక ప్రజలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయాలను సేకరించాలని, మైనింగ్ వల్ల పర్యావరణం, ప్రజల జీవన విధానం, ఆరోగ్యంపై కలుగుతున్న ప్రభావాలను పరిశీలించాలని సూచించారు. మైనింగ్ లీజుల రెన్యువల్ సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారా? గ్రామస్తులకు ముందస్తు సమాచారం ఇచ్చారా? పబ్లిక్ హియరింగ్‌కు సంబంధించిన లేఖలు, ప్రజలు పాల్గొన్న వీడియోలు, ఇతర ఆధారాలు ఉన్నాయా? అని మైనింగ్ యాజమాన్యాలను ప్రశ్నించారు. స్థానిక గ్రామస్తులకు ఉపాధి కల్పిస్తున్నారా? వారికి ఎలాంటి ప్రయోజనాలు అందిస్తున్నారు? గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారా? అనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పెండింగ్ రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి



గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు చేపట్టి మధ్యలోనే నిలిపివేసిన కాంట్రాక్టర్ల ఒప్పందాలను రద్దు చేసి, కొత్త టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు.

బొల్లిగుట్ట తండాలో సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

బొల్లిగుట్ట తండాలో మైనింగ్ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరగా సంబంధిత అధికారులకు వెంటనే సూచనలు చేశారు. అర్హులైన వారికి భూముల పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసి వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ శాఖ డీఈకి సూచించారు.

32 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చలు

కాచారం గ్రామంలో మైనింగ్ సమస్యలకు సంబంధించి గత 32 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులతో హుస్సేన్ నాయక్ మాట్లాడారు. సమ్మె విరమించాలని కోరుతూ, ప్రభుత్వ పరంగా వారికి అందాల్సిన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎస్టీ ప్రజలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని,

గ్రామాల్లో పర్యటన సందర్భంగా ప్రజలు వెల్లడించిన ప్రతి సమస్యను సంబంధిత శాఖల అధికారులు తీవ్రంగా పరిగణించాలని, నిర్ణీత గడువులో నివేదికలు సమర్పించడంతో పాటు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని జాతోతు హుస్సేన్ నాయక్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఎన్‌సీఎస్టీ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంబాబు, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, ఆర్డీఓ వనజారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, డీఎంహెచ్ఓ రాహుల్, ఎంపీడీఓ పార్వతి, సర్పంచులు భీముడు, బుజ్జి, హరిలాల్, శ్యామలయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మౌంట్ లిటరా జీ స్కూల్‌లో న్యాయ చైతన్య కార్యక్రమం





నల్గొండ నవంబర్ 12 (నేటి వెలుగు)

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నల్గొండలోని మౌంట్ లిటరా జీ స్కూల్‌లో విద్యార్థులకు చట్టాలు, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. హిమబిందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల కార్మిక నిర్మూలన చట్టం, న్యాయ సేవాధికార సంస్థ చట్టం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ముఖ్యంగా చిన్నారుల వ్యక్తిగత భద్రతకు సంబంధించి గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ అంశాలను విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషిస్తూ వివరించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండటం, అనుచిత ప్రవర్తన ఎదురైనప్పుడు తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయడం, బాలల సహాయవాణి 1098 నంబర్ ద్వారా సహాయం పొందడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు.నల్గొండ టూ టౌన్ సీఐ శ్రీ ఆది రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, వ్యక్తిగత భద్రతతో పాటు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సమస్యలు ఎదురైనప్పుడు పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు.అనంతరం 8, 9, 10వ తరగతి విద్యార్థులకు విద్యలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు.ఈ పోటీల్లో ప్రథమ బహుమతి జి. బిందుప్రియ 10వ తరగతి ,ద్వితీయ బహుమతి ఎస్. ధనుష 9వ తరగతి తృతీయ బహుమతి ఎం. లక్ష్మీ ప్రసన్న 10వ తరగతి సాధించారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో భరోసా విభాగం ఎస్ఐ, నల్గొండ రూరల్ ఏఎస్ఐ, పాఠశాల ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటరీ భీమనపల్లి శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**